క్లుప్తంగా

భోగి మంటల్లో హామీ పత్రాలు



భోగి మంటల్లో హామీ పత్రాలను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అశ్వారావుపేటరూరల్: భోగి పండుగ రోజున బీఆర్ఎస్ పార్టీ నాయకులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. సోమవారం అశ్వారావుపేటలో ఆ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోగి మంటల్లో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలు అమలు చేయకుండా మోసం చేస్తోందని ఆరు గ్యారెంటీ హామీ పత్రాలను వేసి కాల్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హామీలను విస్మరించి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యూఎస్ ప్రకాశ్‌రావు, సత్యవరపు సంపూర్ణ, మోటూరి మోహన్ పాల్గొన్నారు.

గిరిజనులకు వితరణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని దిబ్బగూడెం పంచాయతీ దురదపాడు గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన వృద్ధులు, వితంతు మహిళలకు వితరణ అందించారు. సోమవారం వినాయకపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భోగి పండుగ సందర్భంగా గ్రామంలోని పేదలకు ఉచితంగా చీరెలు, రగ్గులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పండా రాజు, కుంజా అర్జున్, రాజులు, పండా ముత్యాలు, కాకా చంద్రం, మడకం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పతంగుల పంపిణీ

మణుగూరుటౌన్: వాసవీక్లబ్ మణుగూరు ఆధ్వర్యంలో 50 మంది యువతకు మణుగూరు స్పోర్ట్స్ గ్రౌండ్స్ వద్ద ప్రెసిడెంట్ శ్యామ్ ఆధ్వర్యంలో గాలిపటాలు, దారం, బిస్కెట్లు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చైనా మాంజా వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించి గాలిపటాలు ఎగురవేసే సమయంలో విద్యుత్ తీగలకు దూరంగా ఎగురవేయడంతో పాటు ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐపీసీ బండారు నర్సింహారావు, ట్రెజరర్ కంకటాల సాయి తదితరులు ఉన్నారు.

సెలవుపై హర్షం

మణుగూరుటౌన్: సింగరేణి కార్మికులకు సంక్రాంతి పండుగ రోజు వేతనంతో కూడిన సెలవు అమలు చేయడం అభినందనీయమని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రాణాలను తెగించి కష్టించి పని చేస్తున్న సింగరేణి కార్మికులకు కోల్ ఇండియాలో లేని విధంగా అనేక రకాల ఆర్థిక ప్రయోజనాలు, పథకాలను యాజమాన్యం అమలు చేస్తోందని అన్నారు. ఆప్షనల్ హాలిడే టీబీజీకేఎస్ హయాంలోనే ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

ట్రోఫీల ఆవిష్కరణ

బూర్గంపాడు: బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న యూసుఫ్ మెమోరియల్ 17వ క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీలను సోమవారం దేగల రాజు యాదవ్ ఆవిష్కరించారు. 17 ఏళ్ల క్రితం మృతిచెందిన యూసుఫ్ జ్ఞాపకార్థం అతని ఫ్రెండ్స్ ఈ టోర్నమెంట్ నిర్వహించటం అభినందనీయమన్నారు. ప్రతిఏటా ఈ టోర్నమెంట్‌కు సంబంధించిన ట్రోఫీలను తాను అందిస్తున్నానని, భవిష్యత్‌లో కూడా ట్రోఫీలను అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహక ప్రతినిధులు ఎండి.సోహైల్‌పాషా, గోనెల సర్వేశ్వరరావు, బొల్లు రవికుమార్, భజన ప్రసాద్, అబ్దుల్ సలీం, సారథి, కిషోర్, సత్తిపండు తదితరులు పాల్గొన్నారు.

దివి నుంచి భువికి ప్రతిబింబమై..

ములకలపల్లి: చలికాలం కావడంతో విస్తారంగా మంచు కురుస్తున్న సందర్భం. నిండా తెల్లవారినా కానరాని సూర్యోదయం. ఈ నేపథ్యంలో ములకలపల్లిలో ఉదయం వేళ చీకటి తిమిరాలను చీల్చుకుని, వెలుగునిచ్చేందుకు భానుడు అప్పుడే బయటికొస్తున్నాడు. ఆ ప్రతిబింబం వరి చేలల్లో అబ్బురపరిచేలా ఉండగా.. 'సాక్షి' కెమెరాలో బంధించింది.



ములకలపల్లిలో పొలాల్లోని నీటిలో ప్రతిబింబిస్తున్న సూర్యుడు

ఇళ్ల ముంగిళ్లలో 'భోగి'

భోగ భాగ్యాల భోగి పర్వదినాన్ని సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముంగిళ్లలో రంగురంగుల రంగవల్లులను అద్దారు. ఇళ్లలోని పాత సామన్లు, చీపుర్లు, పిడకలతో భోగి మంటలు వేశారు. పెద్దలు, పిల్లలు తెల్లవారుజామునే నిద్ర లేచి అభ్యంగన స్నానమాచరించి, నూతన వస్త్రాలు ధరించారు. చిన్నారుల తలలపై భోగి పండ్లు వేసి పెద్దలు ఆశీర్వదించారు. మహిళలు పిండి వంటల పనుల్లో మునిగిపోయారు. గంగిరెద్దుల విన్యాసాలు సంప్రదాయాలను గుర్తు చేశాయి. తోబుట్టువులు, బంధువుల రాకతో పల్లెల్లో పండుగ కళ సాక్షాత్కరించింది.

– సాక్షి నెట్‌వర్క్



దమ్మపేట: నాచారంలో భోగి మంటల వద్ద గ్రామస్తులు



మణుగూరుటౌన్: ఎమ్మెల్యే పాయం నివాసం వద్ద కుటుంబ సభ్యులతో భోగి వేడుకలు..



చర్ల: రంగవల్లులతో సందడి చేస్తున్న చిన్నారులు, యువతులు



ములకలపల్లిలో..



భద్రాచలంటౌన్: వీధుల్లో బసవన్నల సందడి



అన్నపురెడ్డిపల్లిలో భోగి మంటలు



అశ్వారావుపేటరూరల్: గుర్రాల చెరువులో రంగవల్లులతో ముస్తాబు చేసిన భోగి మంట



మణుగూరుటౌన్: వాసవీనగర్‌లో..



అశ్వారావుపేటరూరల్: కాలింగుల బజార్‌లో భోగి మంటలు..

వాలీబాల్ పోటీలు ప్రారంభం

దుమ్ముగూడెం: మండలంలోని అచ్చితాపురం గ్రామంలో సోయం నవీన్ కుమార్ మెమోరియల్ చర్ల, దుమ్ముగూడెం మండలాల వాలీబాల్ టోర్నీ పోటీలను సోమవారం ప్రారంభించారు. పోటీలను ఉపాధ్యాయుడు ఏజే ప్రభాకర్, గ్రామ పెద్ద సీనియర్ రిటైర్డ్ ఎంప్లాయ్ గట్టుపల్లి నాగేశ్వరరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు క్రీడలను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఇప్పుదున్న కాలుష్య కోరలను బయటపడాలంటే ఆటలనేనివి చాలా అవసరం అని అన్నారు. క్రీడలతోపాటు చదువును కూడా నిర్లక్ష్యం చేయకుండా ఉన్నత శిఖరాలకి ఎదగాలంటూ హితాబు పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తెల్లం కృష్ణవేణి, పిటి గట్టుపల్లి పూర్ణచంద్రరావు, గట్టుపల్లి ప్రసాద్, టీచర్స్ అసోసియేషన్ గట్టుపల్లి శేషగిరిరావు , తదితరులు పాల్గొన్నారు.

గోదా రంగనాథస్వామి కల్యాణం

బూర్గంపాడు: సారపాక సత్యధామంలోని శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం గోదా రంగనాథస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఈ కల్యాణోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నసమారాధన నిర్వహించారు.

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో భోగి వేడుకను పురస్కరించుకుని గోదాదేవి కల్యాణం సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజారులు బోడెం వెంకన్నశాస్త్రి, అంజనేయశాస్త్రి, భాస్కర్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోత్సరణల నడుమ వందలాది మంది వీక్షిస్తుండగా కల్యాణం జరిపించారు. కుక్కడపు హరిబాబు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ దారా వెంకటేశ్వరరావు, మరకాల రవిందర్‌రెడ్డి, సంకా కృపాకర్, సంకా శంకర్, కుక్కడపు సీతయ్య పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఉన్న దాసాంజనేయ స్వామి వారి దేవాలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవంలో భాగంగా సోమవారం శ్రీకృష్ణ గోదాతిరు కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన ఆలయ అర్చకులు ఆరుట్ల రాజగోపాల్‌చార్యులు గోదా దేవీ కల్యాణ తంతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శిరపు వీర రాఘవరెడ్డి, గుడ్ల శ్రీనివాస్ రెడ్డి, శిరపు అప్పల రెడ్డి, పంపన శివరావు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



బూర్గంపాడు: సత్యనారాయణస్వామి ఆలయంలో గోదా రంగనాథస్వామి కల్యాణోత్సవం



దుమ్ముగూడెం: గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

వెలుగులు నింపని సెంట్రల్ లైటింగ్

మణుగూరురూరల్: పట్టణ ప్రధాన రహదారి సురక్షా బస్టాండ్ నుంచి సాయినగర్ ప్రాంతంలో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వరకు, అంబేడ్కర్ సెంటర్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు కోట్లాది రూపాయలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌తో ఫలితం లేకుండా పోయింది. మణుగూరు పట్టణ అభివృద్ధిలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సెంట్రల్ లైటింగ్, సెంట్రల్ డివైడింగ్, సైడ్ డ్రైన్స్ నిర్మాణాలకు సుమారు రూ.20కోట్ల నిధులను మంజూరు చేయించి పనులను పూర్తి చేయించారు. గత ఏడాది కాలంగా ఈ సెంట్రల్ లైటింగ్ పనితీరు మసకబారింది. సెంట్రల్ లైటింగ్ వెలగకపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాణ్యత లేని లైట్లను వినియోగించడం వల్లే అవి మున్నాళ్లకే పాడైపోయాయని పలువురు ఆరోపిస్తున్నారు. సెంట్రల్ లైటింగ్ విద్యుత్ కాంతులతో వెలుగులు విరాజిమ్మాల్సిన పట్టణ ప్రధాన రహదారి.. అధికారుల నిర్లక్ష్యం, ప్రస్తుత పాలకుల ఉదాసీన వైఖరి వల్ల గత ఏడాది కాలంగా అంధకారంలోనే మగ్గిపోతోంది. సెంట్రల్ లైటింగ్ సరిగా వెలగడం లేదని సోషల్ మీడియాల్లో హల్ చల్ చేసినా, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువవుతోందనే విమర్శలు వినిపిస్తున్నారు. సంబంధిత మున్సిపాలిటీ శాఖ అధికారులు సైతం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడమే కాకుండా సెంట్రల్ లైటింగ్ కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్ లేడంటూ పేర్కొంటుండడం పట్ల ప్రజల నుండి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు సెంట్రల్ లైటింగ్‌పై దృష్టి సారించి వెలగని లైట్లను మార్పు చేసి రాత్రి వేళల్లో పట్టణ రహదారి విద్యుత్ కాంతులతో వెలిగేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



వెలగని లైట్లు..

సంప్రదాయ రుచి.. ఆధునిక పోషణ!

- ఏజెన్సీలో ముమ్మరంగా అటుకుల పట్టింపు
- ప్రతి ఏటా సంక్రాంతికి ఆంధ్రా తయారీదారుల రాక
- అటుకుల రుచితో అంతటా పండుగ శోభ!



కరకగూడెంలో అటుకుల మిల్లు వద్ద ధాన్యం బస్తాలతో ప్రజలు



మిల్లులో అటుకులు పడుతున్న దృశ్యం



ధాన్యాన్ని పొయ్యిలో కాల్చుతున్న నిర్వాహకులు

కరకగూడెం: సంక్రాంతి పండుగ తెలుగు ప్రజలకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత ప్రాముఖ్యత కలిగిన పండుగ. ఇది పంటల పండుగ రైతులు తమ కష్టానికి ప్రతిఫలంగా వచ్చిన పంటను ఇంటికి తెచ్చుకుని సంతోషంగా జరుపుకునే వేడుక. ఈ పండుగ సందర్భంగా అనేక ఆచారాలు సంప్రదాయాలు ఉన్నాయి. వాటిలో ఒకటి అటుకులు తయారు చేయడం.గ్రామీణ ప్రాంతాల్లో గిరిజనులతో పాటు ఇతర ప్రజలు కూడా సంక్రాంతి సమయంలో వరి ధాన్యాన్ని సేకరించి అటుకులు తయారు చేస్తారు.

తయారీ ఇలా..

అటుకులు చేయడానికి ప్రత్యేకంగా దొడ్డు రకం వరి ధాన్యాన్ని ఉపయోగిస్తారు. ఈ ధాన్యాన్ని శుభ్రం చేసి సుమారు 48 గంటల పాటు నీటిలో నానబెడతారు. ఇలా నానబెట్టడం వల్ల ధాన్యం మెత్తబడుతుంది తద్వార అటుకులు చేయడానికి అనువుగా మారుతుంది. నీటిని రెండు మూడు సార్లు మారుస్తూ ఉండాలి దీనివల్ల ధాన్యంలోని మురికి తొలగిపోతుంది. నానబెట్టిన ధాన్యాన్ని నీటి నుండి తీసి ఆరబెడతారు. తరువాత దానిని అటుకుల మిల్లుకు తీసుకువెళ్తారు. పూర్వం రోజుల్లో రోకలి బండల మీద అటుకులను తయారు చేసేవారు కానీ ఇప్పుడు సాంకేతికత అభివృద్ధి చెందడంతో అటుకుల మిల్లులు అందుబాటులోకి వచ్చాయి. ఈ మిల్లుల్లో యంత్రాల సహాయంతో అటుకులను తయారు చేస్తారు. అటుకుల తయారీ విధానంను గమనిస్తే పొయ్యిలో నానబెట్టి ఆరబోసిన ధాన్యాన్ని వేడి చేస్తారు.తరువాత దానిని రోలింగ్ మెషిన్లలో వేసి అటుకులుగా మారుస్తారు. ఈ ప్రక్రియలో ధాన్యం పలుచని రేకులుగా మారుతుంది. వీటినే అటుకులు అంటారు. తయారుచేసిన అటుకులను శుభ్రం చేసి ప్యాక్ చేస్తారు.

ఆంధ్రా వాసుల రాక..

ఆంధ్రా నుంచి ప్రతి యేటా డిసెంబర్, జనవరి నెలలో అటుకుల తయారీ నిర్వాహకులు జిల్లాలోని పలు ప్రాంతాలకు విరివిరిగా వస్తుంటారు. వారితోపాటే తయారీ యంత్రాలు, పనివారిని వెంటబెట్టుకు వస్తారు. అందులో భాగంగా కరకగూడెం మండల కేంద్రంలో ఏపీ నుంచి నిర్వాహకులు గత నెల వచ్చారు. ఇక్కడికి గుండాల, ఆళ్లపల్లి, మంగపేట, పినపాక నుంచి ప్రజలు ప్రతి రోజు భారీ సంఖ్యలో వచ్చి అటుకులు పట్టించుకుని వెళ్తున్నారు. రద్దీ రోజు రోజుకూ పెరగడంతో టోకెన్ విధానాన్ని నిర్వాహకులు ప్రవేశపెట్టి గొడవలు జరగకుండా జాగ్రత్తలు పాటిస్తున్నారు. అటుకులు పట్టించుకోవడానికి వచ్చిన వారికి ఉచిత భోజన సౌకర్యాన్ని కల్పించి వారి ఆకలిని తీర్చుతున్నారు నిర్వాహకులు. కేజీ ధాన్యాన్ని అటుకులుగా మార్చితే 11 రుపాయాలు తీసుకుంటున్నారు. అలాగే అటుకులను కేజీ 50 రుపాయలకు కూడా విడిగా విక్రయిస్తున్నారు. ఇలా రెండు నెలల్లో ఖర్చులు పోను లక్ష నుంచి లక్షన్నర వరకు ఆదాయం వస్తుందని వారు ఈ సందర్భంగా పేర్కొంటున్నారు.

సంక్రాంతికి ప్రాముఖ్యత..

సంక్రాంతి పండుగ అనగానే గుర్తుకు వచ్చే వాటిలో అటుకులు కూడా ఒకటి. కొత్త ధాన్యంతో చేసిన అటుకులను ఈ పండుగ సమయంలో ప్రజలు ప్రత్యేకంగా తింటారు. రైతులు తమ పొలాల్లో పండిన వరి ధాన్యాన్ని ఇంటికి తెస్తారు. ఆ ధాన్యంలో కొంత భాగాన్ని అటుకుల తయారీకి ఉపయోగిస్తారు. సంక్రాంతి పండుగ కొత్త పంటల సంతోషానికి చిహ్నం. అటుకులు ఈ పండుగలో ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయి. వీటిని బెల్లం, నెయ్యి, కొబ్బరి ఇతర పదార్థాలతో కలిపి తింటారు. అటుకులు ఆరోగ్యానికి కూడా మంచివి. సంక్రాంతి పండుగ సమయంలో అటుకులు తయారు చేయడం ఒక ముఖ్యమైన సంప్రదాయం. ఇది గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన విధానంలో ఒక భాగం. ఈ ప్రక్రియ ద్వారా ప్రజలు తమ కష్టానికి ఫలితంగా వచ్చిన పంటను సంతోషంగా జరుపుకుంటారు. అటుకులను వివిధ రకాలుగా తయారు చేసుకోవచ్చు. ఉప్మా, పొంగల్, స్వీట్లు, పాలలో, టీలో కలిపి, ఫ్రై చేసి తీసుకుంటారు.

ఆరోగ్య ప్రయోజనాలెన్నో..

అటుకులు కేవలం సంక్రాంతి పండుగకే పరిమితం కాకుండా ప్రతిరోజు ఆహారంలో భాగంగా తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. అటుకులు తేలికగా జీర్ణమవుతాయి. అటుకుల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. అటుకులతో ఐరన్ శాతం పెరుగుతుంది. విటమిన్ బి1, బి2, బి3, బి6, ఖనిజాలు వంటి పోషకాలు ఉంటాయి.

అటుకులే ఆధారం..



నేను చిన్నప్పటి నుంచి అటుకులు తింటున్నాను. మా ఊర్లో ప్రతి ఇంట్లో అటుకులు ఉండేవి. ఉదయం టిఫిన్, సాయంత్రం స్నాక్స్, పండగలకి, పబ్బాలకి అటుకులే ప్రధానం అప్పుడు. ఇప్పుడంత ఫాస్ట్ ఫుడ్ లేదు కదా అప్పుడు. ఇప్పటి పిల్లలు పిజ్జా, బర్గర్ అని తిరుగుతు తింటున్నారు కానీ అటుకుల్లో ఉన్న పోషకాలు వాటిలో ఉండవు. మన సంప్రదాయ వంటకాలని మనం మర్చిపోకూడదు. వాటిని కాపాడుకోవాలి.

– జనగం పుల్లయ్య, తాటిగూడెం


అటుకులతోనే రోజు మొదలు



మా ఇంట్లో రోజు అనేది అటుకులతోనే మొదలవుతుంది.పొద్దున్నే లేవగానే ముందుగా అటుకులే టీలో పోసుకొని తింటాం. అటుకులు తింటే రోజంతా ఉత్సాహంగా ఉంటాం. ఇప్పుడు చాలామంది ఉదయం బ్రేక్‌ఫాస్ట్ కోసం రకరకాల ఆహారాలు తింటున్నారు. కానీ మన సాంప్రదాయ వంటకాల్లో ఉన్న పోషకాలు వేరే వాటిలో ఉండవు. అటుకులు మన ఆరోగ్యానికి చాలా మంచివి. వీటిని మన ఆహారంలో తప్పకుండా చేర్చుకోవాలి.

– తాటి బుచ్చక్క, గుండాల


ఆంధ్రా నుంచి వస్తుంటారు..



మా ఊరికి ప్రతి సంవత్సరం ఆంధ్రా ప్రాంతం నుంచి అటుకుల వాళ్లు వస్తారు. వాళ్లు వచ్చే సమయం కోసం మేమంతా ఎదురుచూస్తుంటాం. వాళ్లు రావడంతోనే ఊర్లో పండగ వాతావరణం నెలకొంటుంది. అటుకులు తయారు చేసే విధానం కూడా చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ధాన్యాన్ని నానబెట్టడం నుంచి ఆరబోసి అటుకులు తయారు చేసే వరకు ప్రతి దశను చాలా శ్రద్ధగా చేస్తారు. మేమందరం వారికీ ప్రతి విషయంలో అండగా ఉంటాం.

– గుమ్మడివల్లి శ్రీను, కరకగూడెం

శ్రమతో కూడుకున్న పని..



మేము చాలా సంవత్సరాలుగా అటుకుల తయారీ వ్యాపారం చేస్తున్నాం. తయారీ ప్రక్రియ చాలా శ్రమతో కూడుకున్న పని. పొద్దంతా పొయ్యి దగ్గరే ఉండి వేడి చేసిన ధాన్యాన్ని రోలింగ్ మిల్లులో వేసి అటుకులుగా తయారు చేస్తాం. రోలింగ్ చేసేటప్పుడు కూడా చాలా జాగ్రత్తగా ఉండాలి. మరీ పల్చగా చేస్తే విరిగిపోతాయి మరీ మందంగా చేస్తే సరిగ్గా ఉండవు. ఆంధ్ర నుంచి వచ్చినపుడల్లా ఇక్కడి వారు మాకు చాల మద్దతు ఇస్తారు.

– రెక్కల రామిరెడ్డి, అటుకుల మిల్లు నిర్వాహకుడు

ముగ్గుల పోటీలు

మణుగూరురూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మున్సిపాలిటీలోని కుంకుడుచెట్ల గుంపు ప్రాంతంలో యూత్ ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో పూనెం నాగమణి ప్రథమ, కొమరం లావణ్య ద్వితీయ, గనిబోయిన విజయ తృతీయ స్థానాల్లో గెలుపొందారు. విజేతలకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు, యూత్ సభ్యులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు సోలం మల్లయ్య, పాయం వెంకన్న, గనిబోయిన బోడయ్య, గనిబోయిన ముత్తయ్య, గనిబోయిన నాగేశ్వరరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు తుర్రం రవికుమార్, సోలం హరిశంకర్, మడి రమేష్, సోలం సంపత్, వంకా శేఖర్, యూత్ సభ్యులు గనిబోయిన రాజ్‌తరుణ్, ప్రేమ్ సాయి, సాయిరామ్, సాయి కృష్ణ, లోకేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండల కేంద్రంలోని గాంధీ బొమ్మ సెంటర్లో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినమును పురస్కరించుకుని ముగ్గుల పోటీలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు, యువతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అందంగా, చూడ చక్కని రీతిలో రకరకాల రంగులతో ముగ్గులు వేసి, అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన ముగ్గురిని, న్యాయ నిర్ణేతలు విజేతలుగా ఎంపిక చేశారు. ఎంపికైన ప్రభావతి, ధ్వనిక, నవ్యలకు వరుసగా రూ.5116, రూ.3116, రూ.2116ల నగదు బహుమతులను నాయకులు పైడి వెంకటేశ్వరరావు, దారా యుగంధర్, దారా మల్లికార్జునరావు చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ నాయకులు మాడా లక్ష్మీనారాయణ, సర్వేశ్వరరావు, సురేష్, ప్రదీప్ పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల క్రాస్ రోడ్డులో దిశా వెల్ఫేర్ ప్రొటెక్షన్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పోటీల్లో పాల్గొని అందమైన ముగ్గులు వేశారు. ఐటీసీ పీఎస్‌పీడీ బీఆర్‌టీయూ అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐటీసీ బీఆర్‌టీయూ నాయకులు షేక్ అజీమ్, కోమటిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, గద్దల నాగేశ్వరరావు, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, దిశ సొసైటీ నాయకులు అన్నపూర్ణ, నిర్మల, వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.



దమ్మపేట: పోటీల్లో మహిళలు, యువతులు